క్లుప్తంగా

మట్టి ప్రతిమల తయారీపై శిక్షణ



ఫిరంగిపురం: వేమవరం మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో శుక్రవారం విద్యార్థులకు మట్టి వినాయకుడి ప్రతిమల తయారీపై శిక్షణ ఇచ్చారు. హెచ్ఎం దివి కమల్‌మోహన్ మాట్లాడుతూ పర్యావరణ హితం కోసం మట్టి వినాయక ప్రతిమలనే పూజించాలని చెప్పారు. అనంతరం విద్యార్థులతో మట్టి ప్రతిమలు తయారు చేయించారు. కార్యక్రమంలో పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్ జెట్టి సుబ్బయ్య, ఉపాధ్యాయులు శేషరవి, అంగన్‌వాడీ పద్మ, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

గణపతి పందిళ్ల వద్ద కమిటీలదే బాధ్యత



తాడేపల్లిరూరల్: వినాయక పందిళ్ల వద్ద ఉత్సవ కమిటీలు పూర్తి బాధ్యత వహించాలని తాడేపల్లి సీఐ కళ్యాణ్ రాజు చెప్పారు. శుక్రవారం తాడేపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ తాడేపల్లి పట్టణ, రూరల్‌లో గణపతి పందిళ్లు, వినాయక విగ్రహాల ఏర్పాటుకు అనుమతులు తీసుకోవాలని సూచించారు. సింగిల్ విండో విధానం ద్వారా అనుమతులు మంజూరు చేస్తామని వివరించారు. నిమజ్జనోత్సవాల సమయంలో డీజేలు, బాణసంచా కాల్చేందుకు అనుమతి లేదని స్పష్టం చేశారు. మద్యపానం, అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా నిర్వాహక కమిటీలే బాధ్యత తీసుకోవాలని చెప్పారు.

ద్రవ జీవామృతంపై అవగాహన

తాడేపల్లిరూరల్: వరద ముంపునకు గురైన పంటలను ఎలా కాపాడుకోవాలనే అంశంపై శుక్రవారం ఉండవల్లికి చెందిన తమ్మా దుర్గాప్రసన్న రైతులకు వివరించారు. వరి పొలాల్లో నీటిని తొలగించిన అనంతరం ద్రవ జీవామృతం పిచికారీ చేయడం వల్ల జరిగే లాభాల గురించి చెప్పారు. ద్రవ జీవామృతం ఎలా తయారు చేసుకోవాలో చూపించారు. కార్యక్రమంలో తుమ్మ భాగ్యలక్ష్మి, ప్రకృతి వ్యవసాయ రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఎలక్ట్రికల్ దుకాణంలో చోరీ

తాడికొండ: తాడికొండ అడ్డరోడ్డులోని విజయ గణపతి ఎలక్ట్రికల్ దుకాణంలో శుక్రవారం తెల్లవారు జామున చోరీ జరిగింది. రాత్రి సమయంలో తాళాలు పగలగొట్టి లోపలికి చొరబడిన దొంగలు రూ.2 లక్షలు విలువ చేసే సామగ్రి దొంగిలించినట్లు నిర్వాహకులు ఫిర్యాదు చేశారు. దుకాణ యజమాని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తాడికొండ సీఐ కె.వాసు తెలిపారు.

పగిలిన పైప్‌లైన్



తాడేపల్లిరూరల్: ఉండవల్లిలో పైప్‌లైన్ పగలడంతో శుక్రవారం తాగునీటి సరఫరాను తాత్కాలికంగా నిలిపివేశారు. ఉండవల్లి హరిజనవాడకు వెళ్లే మార్గంలో గుంటూరు చానల్ పక్కనే ఉన్న సాయినగర్‌కు నేరుగా డైరెక్ట్ పంపింగ్ ద్వారా నీటిని అందిస్తున్నారు. జేసీబీతో వరద నీటిని పంపేందుకు మట్టిని తవ్వుతుండగా మట్టిలో ఉన్న పైప్‌లైన్ పగిలింది. దీంతో తాగునీటి సరఫరాను నిలిపివేసి సాయంత్రం వరకు మరమ్మతులు చేపట్టి తాగునీటి సరఫరాను పునరుద్ధరించారు.

రైతులు ఈ-పంటలో నమోదు చేయించుకోవాలి



తాడేపల్లిరూరల్: రైతులు తాము పండిస్తున్న పంట వివరాలను తప్పనిసరిగా ఈ-పంటలో నమోదు చేయించుకోవాలని దుగ్గిరాల మండల వ్యవసాయ అధికారి శిరీష చెప్పారు. దుగ్గిరాల మండల పరిధిలోని పెదపాలెం, చినపాలెం, పెరుకలపూడి, ఈమని గ్రామాల్లో ఇటీవల కురిసిన అధిక వర్షాల వల్ల ముంపు బారిన పడిన పొలాలను శుక్రవారం ఆమె పరిశీలించారు. అనంతరం రైతులతో మాట్లాడుతూ ఈనెల 10వ తేదీలోపు దగ్గరలోని రైతు సేవా కేంద్రాల వద్ద పంట వివరాలు నమోదు చేయించుకోవాలని తెలిపారు. ఈ-పంట నమోదు తప్పనిసరని, అప్పుడే నష్టపరిహారం, రాయితీలు వస్తాయని వివరించారు. పొలాల్లో వరద నీరు తరలించిన అనంతరం చేపట్టాల్సిన చర్యలను వివరించారు. పంట నష్టం అంచనాలను గ్రామ వ్యవసాయ అధికారి, వీఆర్వోలు పంట పొలాన్ని సందర్శించి వివరాలు నమోదు చేసుకుంటారని వెల్లడించారు.

వి(శ్వ)నాయకా జైజైజై



'ఘన'పతిబొప్పా మోరియా: ఫిరంగిపురం రాములవారి వీధిలో ఏర్పాటు చేసిన గణపతి మంటపం





భక్తి ప్ర'పత్రుల'తో: మంగళగిరి మార్కెట్లో పత్రి, పూజాసామగ్రి కొనుగోలు చేస్తున్న భక్తులు

వినాయక చవితి సందర్భంగా కోలాహలం నెలకొంది. మార్కెట్లు కళకళలాడుతున్నాయి. శనివారం గణపతిని ఘనంగా కొలిచేందుకు భక్తులు సిద్ధమయ్యారు. ఊరూవాడా చలువ పందిళ్లు, మంటపాలు వెలుస్తున్నాయి. పత్రి, పూజాసామగ్రి, గణేశుని విగ్రహాలు, కొత్త వస్త్రాలు కొనుగోలు చేసే భక్తులతో దుకాణాలు కిటకిటలాడుతున్నాయి.

– మంగళగిరి/ఫిరంగిపురం/తాడికొండ



అందమైన పందిరిలోన..: సుందరమైన సెట్టింగులతో ఏర్పాటు చేస్తున్న చవితి చలువ పందిరి



'ప్రతిమ'దినీ దోచే: మంగళగిరిలో అమ్మకానికి సిద్ధంగా ఉన్న గణపతి ప్రతిమలు

పోషకాహారంతో రక్తహీనత నివారణ



తాడికొండలో పౌష్టికాహారం అంజేస్తున్న దృశ్యం



వేమూలూరిపాడులో పౌష్టికాహారం గురించి వివరిస్తున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మహాలక్ష్మి

తాడికొండ/ఫిరంగిపురం: పోషకాహారం తీసుకుంటే రక్తహీనతకు దూరం కావచ్చని తాడికొండ హోమియో ఆస్పత్రి వైద్యురాలు హసీనా సూచించారు. శుక్రవారం తాడికొండలోని అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొని పౌష్టికాహారంతో జరిగే ఆరోగ్య మేలులను వివరించారు. అనంతరం పలువురు గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వై.శ్రీలత, ఏఎన్ఎం హేమలత పాల్గొన్నారు.

● ఫిరంగిపురం మండలంలోని వేమూలూరిపాడు ప్రాథమికోన్నత పాఠశాలలో శుక్రవారం ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మహాలక్ష్మి పోషకాహార మాసోత్సవం నిర్వహించారు. విద్యార్థులకు పోషకాహారం గురించి వివరించారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం ప్రమీల, అంగన్‌వాడీలు సుజాత, భూలక్ష్మి, ఫాతిమా, వెంకటలక్ష్మి, విజయశ్రీ పాల్గొన్నారు.

ముంపు గ్రామాల్లో కలెక్టర్ పర్యటన

- సమస్యలు విన్నవించిన గ్రామస్తులు
- పరిష్కరించాలంటూ అధికారులకు ఆదేశాలు



పాత బొమ్మువానిపాలెంలో బాధితుల సమస్యలు అడిగి తెలుసుకుంటున్న కలెక్టర్ నాగలక్ష్మి

కొల్లిపర: ముంపునకు గురైన పాతబొమ్మువానిపాలెం, అన్నవరపులంక , కొత్తూరులంక గ్రామాల్లోని వరద బాధితులను శుక్రవారం జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి పరామర్శించారు. తెనాలి సబ్‌కలెక్టర్ వి.సంజన సింహా, మండల స్థాయి అధికారులతో కలసి ఆయా గ్రామాల్లో పర్యటించారు. వరదల కారణంగా ప్రభుత్వ అందిస్తున్న సహాయ సహకారాలు సరిగ్గా అందుతున్నదీ లేనిదీ బాధితులను అడిగి తెలుసుకున్నారు. వరదలకు పశువుల పాకలు, పూరిళ్లు పూర్తిగా దెబ్బతిన్నాయని లంక గ్రామాల ప్రజలు చెప్పారు. ఎండుగడ్డి వర్షాలకు తడిచినందున, పశువులు తినడం లేదని చెబుతూ, పశువులకు ఇచ్చే దాణా మరింత అందించాలని కోరారు. పశువులకు రోగాలు వస్తున్నందున, వాటికి గ్రామంలోనే వైద్యం అందించే ఏర్పాటు చేయాలన్నారు. పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు.

జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి మాట్లాడుతూ వరదలు కారణంగా నష్టం జరిగిన ప్రతి ఒక్కరికీ అన్ని విధాల ప్రభుత్వం నుంచి సహాయ సహకారాలు అందిస్తామని భరోసా కల్పించారు. గ్రామంలో నష్టం జరిగిన ఇళ్లు, పశువుల పాక వంటివి ప్రతీది, అధికారులు రికార్డులో నమోదు చేసి వాటిని తమకు అందిస్తారని వాటిని పరిశీలించి వీలైనంత త్వరగా బాధితులకు సహకారం అందించేలా చూస్తామన్నారు. పశువులకు ప్రభుత్వం అందిస్తున్న దాణా అవసరమైన వారికి పూర్తిస్థాయిలో అందించాలని పశువైద్యాధికారి సాయి సతీష్‌రాజును ఆదేశించారు. వరదల కారణంగా పంటలు దెబ్బతిన్న రైతు, కౌలు రైతులకు వెంటనే ఈ క్రాప్ బుకింగ్ చేయాలని, ఎటువంటి పట్టాలు లేకుండా లంక సొసైటీ భూములలో పంటలు సాగుచేస్తున్నారో? వారి జాబితా కూడా వెంటనే తయారు చేయాలని మండల వ్యవసాయ అధికారి కె.వెంకటరావును ఆదేశించారు. ఎంపీడీవో విజయలక్ష్మి, తహసీల్దారు సిద్ధార్థ తో మాట్లాడుతూ లంక గ్రామంలో ప్రజలకు ఎటువంటి రోగాలు రాకుండా 24 గంటలు వైద్య సిబ్బంది అందుబాటులో ఉండాలని, పారిశుద్ధ్య పనులు వేగవంతం చేయాలని ఆదేశించారు. అనంతరం అన్నవరపులంకలో కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ , గుంటూరు జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ హెనీ క్రిస్టినా, మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ తో కలసి బాధితులకు రోటరీ క్లబ్ ఆఫ్ గుంటూరు వారు అందించిన నిత్యావసర సరకులను పంపిణీ చేశారు. డిప్యూటీ సీఈవో జె.మోహనరావు, ఎంపీడీవో వి.విజయలక్ష్మి, తహసీల్దారు సిద్ధార్థ, ఏవో వెంకటరావు, మండల పరిషత్ ఏవో చంద్రమోహన్, వీఆర్‌వోలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

బాధితులకు అండగా ఉంటాం

కేంద్ర మంత్రి పెమ్మసాని



పునరావాస కేంద్రంలో బాధితులతో మాట్లాడుతున్న కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్

తెనాలిరూరల్: ప్రభుత్వం తరపున ప్రతి బాధితుడికి సాయం అందేలా చూస్తామని కేంద్ర కమ్యూనికేషన్స్ సమాచార మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ చెప్పారు. రూరల్ మండలం బుర్రిపాలెం గ్రామంలో వరద బాధితులకు గ్రామ జెడ్పీ హైస్కూల్లో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాన్ని మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌తో కలసి శుక్రవారం ఆయన పరిశీలించారు. వరద బాధితులతో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం బియ్యం ఇతర సరుకులను అందజేస్తోందని, ప్రతి ఒక్కరికి సాయం అందుతుందని చెప్పారు. అనంతరం గ్రామంలో ముంపుకు గురైన ఎస్టీ కాలనీలోని ఇళ్లను పరిశీలించారు. అలానే గుంటూరు మార్గమధ్యంలో కొలకలూరు, హాఫ్‌పేట వద్ద పొలాలను పరిశలీఇంచి రైతులతో మాట్లాడారు.

కాంట్రాక్టు స్టాఫ్ నర్సుల నిరసన

గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్‌లో పనిచేస్తున్న కాంట్రాక్టు స్టాఫ్ నర్సులు నల్లబ్యాడ్జిలు ధరించి శుక్రవారం విధులు బహిష్కరించారు. సర్దుబాటు కోసం విడుదల చేసిన జీఓ నంబరు 115 నిలుపుదల చేయాలని డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ నర్సెస్ స్ట్రగుల్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో నాయకులు మాట్లాడారు. కార్యక్రమంలో నర్సెస్ స్ట్రగుల్ కమిటీ నేతలు స్వచ్ఛంద ప్రసాద్, పి.మనీష, బి.శివమ్మ, వి.విజయ్‌కుమార్, హైమావతి, కుసుమకుమారి, కరుణ పాల్గొన్నారు. నాట్కో క్యాన్సర్‌సెంటర్‌లోని నర్సింగ్ కార్యాలయం అధికారులు తమను బెదిరించినట్లు కాంట్రాక్టు నర్సింగ్ సిబ్బంది వాపోయారు.

ఐక్యవేదిక మద్దతు..

గుంటూరు జీజీహెచ్‌లో కాంట్రాక్టు స్టాఫ్ నర్సులు చేస్తున్న ఆందోళనకు జిల్లా ఐక్యవేదిక నేతలు మద్దతు తెలిపింది. ఐక్యవేదిక జిల్లా చైర్మన్ చాంద్ బాషా, పలువురు నేతలు జీజీహెచ్‌కు విచ్చేసి కాంట్రాక్టు స్టాఫ్‌నర్సులతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి శివారెడ్డి, నగరశాఖ అధ్యక్షుడు వై.నాగేశ్వరరావు, జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి కరిముల్లాషాఖాదిరి, జిల్లా మహిళా అధ్యక్షురాలు హేమలత, సంయుక్త కార్యదర్శి షబానా సుల్తానా, అరుణకుమారి, విజయబాబు, రత్తయ్య, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రైల్వే హెల్ప్‌లైన్‌పై అవగాహన

తాడేపల్లిరూరల్: దుగ్గిరాల జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో రైల్వే హెల్ప్‌లైన్, చైల్డ్ టోల్‌ఫ్రీ నంబర్లపై శుక్రవారం అవగాహన కల్పించారు. ముఖ్య అతిథులుగా రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ తెనాలి సబ్ ఇన్‌స్పెక్టర్ వి.గిరియ్య, గుంటూరు రైల్వే చైల్డ్ హెల్ప్‌లైన్ టీమ్ మెంబర్ వాకా లక్ష్మణ్ నందన్ మాట్లాడుతూ రైలులో ప్రయాణం చేసే సమయంలో ఏదైనా ఇబ్బందులు తలెత్తితే రైల్వే హెల్ప్‌లైన్ నంబర్ 139కు సమాచారం అందించాలని, రైల్వే ట్రాక్ దాటేటప్పుడు చాలా జాగ్రత్తగా వ్యవహరించాలని, రైల్వే బ్రిడ్జిలపై, ఫుట్‌పాత్‌లపై ఫొటోలు దిగవద్దని వివరించారు. బాలల హక్కులు, చైల్డ్ టోల్ ఫ్రీ నంబర్ 1098 ఆవశ్యకత గురించి చెప్పారు. బడిని వీడిన పిల్లలు లేదా బిక్షాటనలో ఉన్న పిల్లలు కనిపిస్తే 1098కు సమాచారం అందించాలని వివరించారు. బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయురాలు జి.ఉమాదేవి, రైల్వే చైల్డ్ హెల్ప్ లైన్ గుంటూరు టీమ్ మెంబర్లు ఎ.సావిత్రి, ఎ.చెల్సియా, తెనాలి రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ సిబ్బంది పాల్గొన్నారు.

గో సంరక్షణకు చర్యలు తీసుకుంటాం



గుంటూరు రూరల్: వెంగళాయపాలెంలోని నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గో సంరక్షణశాలను నగర మేయర్ కావటి మనోహర్‌నాయుడు శుక్రవార ఆకస్మిక తనిఖీ చేశారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాల కారణంగా గోవులు తీవ్ర ఇబ్బంది పడుతున్నాయని, వాటికి ఆహారం కూడా సరిగా అందటంలేదని ఫిర్యాదులు అందుతున్న నేపథ్యంలో గో సంరక్షణ, గో ప్రేమికులు, నగరపాలకసంస్థ అధికారులతో కలసి మేయర్ పరిశీలించారు.

గో ప్రేమికులతో చర్చించి, తీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ గోవులు ఇబ్బంది పడుతున్నప్పటికీ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడంపై అధికారులు సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్షణమే గోశాలను రోబో యంత్రంతో శుభ్రం చేయించాలని ప్రజారోగ్య అధికారులను ఆదేశించారు. గోవులను వివిధ ప్రాంతాల నుంచి వేరొక ప్రాంతాలకు అనధికారికంగా తరలిస్తున్న వాహనాలను గోసంరక్షణ సభ్యులు పోలీసులు పట్టుకుని, వాటిలో ఉన్న గోవులను నగరపాలకసంస్థ గోసంరక్షణకు తరలించుట వలన గోవుల సంఖ్య పెరిగాయన్నారు. నగర పాలక సంస్థ అధికారులు గోవుల సంరక్షణలో నిర్లక్ష్యం వహించడం తగదని హితవుపలికారు. గోవుల సంఖ్య ఎక్కువగా ఉండుటంవల్ల గో సంరక్షణశాల చుట్టుపక్కల ఖాళీ స్థలంలో ఫెన్సింగ్ వేసి వాటిని బయటకి వదలాలన్నారు. గో సంరక్షకులుగాని, గోవులను పెంచుకోదలచుకున్న వారికి నిబంధనల ప్రకారం గోవులను అందజేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో గో సంరక్షణ ప్రేమికులు సిహెచ్.రాజు, ఆర్.కోటేశ్వరరావు, జి.మనోహర్, ఎస్. మనోహర్ పాల్గొన్నారు.

మట్టి ప్రతిమల పంపిణీ



మట్టి వినాయక విగ్రహాలను అందజేస్తున్న ప్రిన్సిపాల్, విద్యార్థులు



బీఎస్ఎస్‌బీ జూనియర్ కళాశాలలో మట్టి వినాయక విగ్రహాలు పంపిణీ చేస్తున్న దృశ్యం

మోతడక(తాడికొండ): మట్టి వినాయక విగ్రహాలు పర్యావరణానికి మేలు చేస్తాయని మోతడక చలపతి ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.నాగ శ్రీనివాసరావు చెప్పారు. వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకొని కళాశాల కంప్యూటర్ సైన్స్ విభాగం టెక్నోక్రాట్స్ అసోసియేషన్ విద్యార్థుల ఆధ్వర్యంలో మట్టి వినాయక విగ్రహాల పంపిణీ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో మోతడక సర్పంచ్ యడ్లపల్లి పార్వతీ, ఎంపీటీసీ కంచర్ల సాంబశివరావు పాల్గొన్నారు.

● తాడికొండ బీఎస్ఎస్‌బీ జూనియర్ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సునీత, ఎన్ఎస్ఎస్ విభాగం అధికారి వేణుబాబు పాల్గొన్నారు.

అశ్లీల నృత్యాలు, వివాదాలకు తావిస్తే కఠిన చర్యలు



వినాయక విగ్రహ కమిటీ నిర్వాహకులతో మాట్లాడుతున్న తాడికొండ సీఐ వాసు

తాడికొండ: వినాయక మండపాల వద్ద అశ్లీల నృత్యాలు, వివాదాలకు తావిస్తే కఠిన చర్యలు తప్పవని తాడికొండ సీఐ కె.వాసు హెచ్చరించారు. శుక్రవారం తాడికొండ పోలీస్‌స్టేషన్‌లో వినాయక విగ్రహ నిర్వాహక కమిటీ సభ్యులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ విగ్రహ ఏర్పాటు కోసం అనుమతి తీసుకునే సమయంలో ఎప్పుడు నిమజ్జనం చేసేది వివరాలు తెలియజేయాలన్నారు. ఊరేగింపు సమయంలో బాణసంచా కాల్చరాదని, నిబంధనలు అతిక్రమించి ప్రవర్తించిన వారిపై చట్టపరమైన చర్యలు ఉంటాయని, నిర్వాహకులదే పూర్తి బాధ్యత కనుక అప్రమత్తంగా ఉండి శాంతిభద్రతల పర్యవేక్షణకు సహకరించాలన్నారు. కార్యక్రమంలో పలువురు పోలీసు సిబ్బంది, నిర్వాహకులు పాల్గొన్నారు.

పంటపొలాలను సందర్శించిన జెడ్పీ చైర్‌పర్సన్



పంటపొలాలను పరిశీలిస్తున్న హెనీ క్రిస్టినా

తెనాలి: ఉమ్మడి గుంటూరు జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టిన శుక్రవారం తెనాలి మండలంలోని కొలకలూరు, హాఫ్‌పేట, ఖాజీపేట గ్రామాల్లోని నీట మునిగిన పంటపొలాలను పరిశీలించారు. నడుము లోతు నీళ్లతో పంట పొలాలు చెరువులను తలపిస్తుండటాన్ని గమనించారు. చేల గట్లు మినహా పంట ఎక్కడా కనిపించలేదు. వేలాది రూపాయల పెట్టుబడులు పెట్టి పంట వేసుకుంటే అకాల వర్షంతో పొలాలన్నీ నీటి మునిగి చెరువుల్లా మారిపోయాయని రైతులు ఆవేదన వెలిబుచ్చారు పంట పనికిరాదని చెప్పారు. పంట పొలాలను చూస్తుంటే చాలా ఆవేదనంగా ఉందని హెని క్రిస్టినా అన్నారు. అకాల వర్షాలతో తమ కాలనీ అంతా నీట మునిగిందని హాఫ్‌పేట గ్రామస్తులు చెప్పారు. ఇళ్లలోని గృహోపకరణాలు కూడా పాడైనట్టు చెప్పారు. రైతుల కష్టాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు. ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ మంత్రులు నారా లోకేష్, నాదెండ్ల మనోహర్ దృష్టికి తీసుకువెళ్లి సాయం అందేలా చూస్తానని చెప్పారు. చేస్తానని రైతులకు హామీ ఇచ్చారు పంటపొలాలను చూస్తే తాను కలత చెందానని చెప్పారు.

బజరంగ్ ఆధ్వర్యంలో ఏడు వేల మట్టి ప్రతిమల పంపిణీ



మట్టి వినాయకుడి ప్రతిమలను పంపిణీ చేస్తున్న బజరంగ్ అర్బన్ ఇన్‌ఫ్రా సీఈఓ అంబటి మురళీకృష్ణ

కొరిటిపాడు: మట్టి వినాయకుడిని పూజించి ప్లాస్టిక్ రహిత సమాజ నిర్మాణానికి ముందడుగు వేద్దామని బజరంగ్ అర్బన్ ఇన్‌ఫ్రా సి.ఈ.ఓ. అంబటి మురళీకృష్ణ పిలుపునిచ్చారు. మట్టి వినాయకుడిని పూజిద్దాం అనే నినాదంతో బజరంగ్ అర్బన్ ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం మట్టి గణపతి ప్రతిమల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. గుంటూరు నగరం పట్టాభిపురంలో ఆరు వేలు ప్రతిమలు, పొన్నూరు మండలం మామిళ్లపల్లి గ్రామంలో వెయ్యి ప్రతిమలను పంపిణీ చేశారు. బజరంగ్ సి.ఈ.ఓ. అంబటి మురళీకృష్ణ మాట్లాడుతూ వినాయక చవితి పర్వదినానికి ప్రకృతికి అవినాభావ సంబంధం ఉందని, దాన్ని మన పూర్వీకులు వేల సంవత్సరాల క్రితమే ఆచారంగా అందించారని తెలిపారు. ప్రజలంతా మట్టి గణపతి ప్రతిమను పూజించడం ద్వారా పండుగ మరింత శోభాయమానంగా విరాజిల్లుతుందని చెప్పారు. మూడేళ్లగా మట్టి గణపతి ప్రతిమలను పంపిణీ చేస్తున్నా మని వెల్లడించారు. కార్యక్రమంలో బజరంగ్ డైరెక్టర్లు సిద్దినేని శ్రీనివాసరావు, సమీర్ నందన్, జి.సుబ్బారా వు, ప్రాజెక్టు మేనేజర్ సుధాకర్ రెడ్డి పాల్గొన్నారు.

అసోం, నాగాలాండ్‌లో డాక్టర్ నిశాంత్ వైద్య సేవలు



గుంటూరు మెడికల్: గుంటూరుకు చెందిన ప్రఖ్యాత ప్లాస్టిక్, కాస్మోటిక్ సర్జన్ డాక్టర్ నిశాంత్ సాధనాల గిరిజన ప్రాంతాల్లో ప్రజలకు ఉచిత వైద్య సేవలు అందించారు. సెప్టెంబరు మొదటి వారంలో అసోం – నాగాలాండ్ సరిహద్దులోని 15 మంది చిన్నారులకు రోగులకు ఉచిత శస్త్రచికిత్సలు విజయవంతంగా చేశారు. సేవా యాత్ర ముగించుకుని శుక్రవారం గుంటూరు వచ్చిన డాక్టర్ నిశాంత్ సాధనాల మీడియాతో మాట్లాడారు. గ్రహణం మొర్రి, చీలిక పెదవి సమస్యలతో బాధపడుతున్న పిల్లలు, కాలిన గాయాల కారణంగా వికృత రూపాలకు గురైన గిరిజన ప్రాంత బాధితులకు ఉచితంగా శస్త్రచికిత్సలు చేశామన్నారు. జీవన రేఖ ఎక్స్‌ప్రెస్‌లో పనిచేయడం చాలా ఆనందంగా ఉందన్నారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ 'జీవన రేఖ ఎక్స్‌ప్రెస్' వంటి పథకాల ద్వారా వీరికి చక్కని వైద్య సేవలు అందిస్తున్నామని చెప్పారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు

వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు

శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

99122 25447 (మంగళగిరి)
7075167541 (తాడికొండ)

Office mail : sakshigntadvt@gmail.com